సాక్షి
జగిత్యాల
గురువారం । 1 । మే । 2025

ధర్మపురిలో నారసింహ హోమం



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలో అక్షయ తృతీయ సందర్భంగా నారసింహ హోమం వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన నారసింహ ఉపాసకులు అనిల్‌కుమార్ జోషి ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

‘పది’లో నాలుగో స్థానం

- ఏడు స్థానాలు మెరుగుపర్చుకున్న జిల్లా
- 11వ స్థానం నుంచి 4వ స్థానానికి..
- ఎప్పటిలాగే బాలికలే ముందంజ
- మొత్తంగా 98.20 శాతం ఉత్తీర్ణత

జగిత్యాల: పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచింది. జిల్లాగా అవతరించిన తర్వాత మూడేళ్లు అగ్రస్థానంలో ఉన్న జిల్లా కొన్నాళ్లుగా నిరాశ పరుస్తోంది. గతేడాది 11వ స్థానంలో నిలిచిన జిల్లా.. ఈ ఏడాది పుంజుకుని ఏకంగా ఏడు స్థానాలు మెరుగుపర్చుకుంది. 2016లో జిల్లా ఆవిర్భవించిన విషయం తెల్సిందే. 2016–17, 2017–18, 2018–19లో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచి హ్యాట్రిక్ సాధించి చరిత్ర సృష్టించింది. అప్పట్లో విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు తీసుకోవడంతోపాటు ఉపాధ్యాయులు శ్రద్ధ చూపించి బోధించడంతో వందశాతం ఫలితాలు సాధ్యమయ్యాయి. తర్వాత 2022లో 91.37 శాతంతో 21వ స్థానానికి పడిపోయింది. ఇక 2023లో 24వ స్థానానికి చేరింది. గతేడాది (2024) 11వ స్థానాన్ని సాధించింది. ఈ ఏడాది మరో ఏడు స్థానాలు మెరుగుపర్చుకుని నాలుగో స్థానంలో నిలిచింది.



ఇబ్రహీంపట్నంలో విద్యార్థులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు



గొల్లపల్లిలో విద్యార్థులను అభినందిస్తున్న మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ సుంకరి రవి

ప్రత్యేక కార్యచరణతో ముందుకు

కలెక్టర్ సత్యప్రసాద్, డీఈవో రాము ప్రత్యేక కార్యాచరణతో పదిలో జిల్లా మెరుగైన ఫలితాలు సాధించింది. స్కూల్ కాంప్లెక్స్, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు వర్చువల్‌గా మీటింగ్‌లు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులను ఏ, బీ, సీ గ్రూపులుగా విడదీసి వెనుకబడిన వారికి ప్రత్యేక క్లాసులు నిర్వహించారు. సబ్జెక్ట్‌ల వారిగా గ్రాండ్‌టెస్ట్‌లు పెట్టారు. జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలన్న ఉద్దేశంతో కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరీక్షలంటే భయం లేకుండా అనేక సలహాలు ఇచ్చారు. ప్రశంసపత్రం, పంచసూత్రాలు అనే కరపత్రాన్ని ప్రతి విద్యార్థికి అందించి భయాన్ని పోగొట్టి మార్గదర్శనం చేశారు. తరగతులు ఎలా ఉన్నాయి..? ఉపాధ్యాయులు ఎలా చెబుతున్నారు..? ఎలా ప్రోత్సహిస్తున్నారు..? తెలుసుకునేందుకు ఫోన్‌ఇన్ కార్యక్రమం ప్రారంభించారు. సందేహాలుంటే నివృత్తి చేసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేశారు.

హాజరైన బాలురు	5,962
బాలికలు	5,887
మొత్తం	11,849
ఉత్తీర్ణులైన బాలురు	5,823
ఉత్తీర్ణులైన బాలికలు	5,813
ఉత్తీర్ణులైన మొత్తం	11,636
ఉత్తీర్ణత శాతం	98.20
మొత్తం పాఠశాలలు :	336
వందశాతం ఉత్తీర్ణత సాధించినవి	221

అందరి కృషితోనే



అందరి కృషితో మెరుగైన ఫలితాలు సాధించాం. జిల్లా మొత్తంగా 98.20శాతంతో రాష్ట్రంలో నాల్గో స్థానంలో నిలిచాం. డీఈవో, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు చాలా కృషి చేశారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేయడంతో మెరుగైన ఫలితాలు సాధించాం.

– సత్యప్రసాద్, కలెక్టర్

ప్రణాళిక ప్రకారం ముందుకు..



పరీక్షలకు మూడు నెలల ముందు నుంచే ప్రణాళికతో ముందుకెళ్లాం. అగ్రస్థానంలో ఉండాలన్న ఉద్దేశంతో ప్రత్యేక క్లాసులు ఏర్పాటు చేశాం. కలెక్టర్ ముఖాముఖీ, ప్రత్యేకంగా సబ్జెక్టులు తయారుచేసి ఇచ్చారు. విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టేలా మార్గదర్శకం చేసి ఫలితాలు రాబట్టాం.

– రాము, డీఈవో

ఉన్నతాధికారుల కృషితోనే



జిల్లా నాల్గో స్థానం పొందడం గర్వంగా ఉంది. ఉన్నతాధికారుల కృషితోనే ఇది సాధ్యమైంది. కలెక్టర్ సత్యప్రసాద్ చొరవ, డీఈవో రాము చేపట్టిన కార్యక్రమాలతోనే మెరుగైన ఫలితాలు సాధించాం.

– మచ్చ శంకర్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

ప్రత్యేక క్లాసులతో..



విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహించడంతో పాటు కలెక్టర్ ముఖాముఖి నిర్వహించడంతో ఫలితాలు వచ్చాయి. వారిలో భయం పోయేలా ఉన్నతాధికారులు కృషి చేశారు. నాల్గో స్థానం రావడం అభినందనీయం.

– యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, పీఆర్టీయూ

వ్యవసాయ కుటుంబం నుంచి జిల్లా టాపర్‌గా..



అమూల్య, ఆమె తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఎంఈవో నాగభూషణం

సారంగాపూర్: పదో తరగతి ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచిన కడారి అమూల్య తల్లిదండ్రులు సరిత, గంగాధర్. వీరిది వ్యవసాయ కుటుంబం. బీర్‌పూర్ గ్రామానికి చెందిన అమూల్య అదే గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి 600 మార్కులకు 580మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. అమూల్యను ఎంఈవో సిరుప నాగభూషణం, హెచ్‌ఎం సంగెనభట్ల నర్సింహ్మమూర్తి, ఉపాధ్యాయులు, మాజీ ఎంపీపీ మసర్తి రమేశ్ అభినందించారు.

కూలీబిడ్డ మండల టాపర్..



తల్లితో కలిసి బీడీలు చుడుతున్న బొడ్డుపల్లి రక్షిత

రాయికల్: రాయికల్ మండలం భూపతిపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో చదివిన బొడ్డుపల్లి రక్షిత 568 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. తండ్రి లక్ష్మీనారాయణ ఉపాధి నిమిత్తం ముంబయి వెళ్లి కూలీగా పనిచేస్తున్నాడు. తల్లి జమున గ్రామంలో కూలీ పనులకు వెళ్తోంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో రక్షిత 568 మార్కులు సాధించింది. చేతిలో చిల్లిగవ్వ లేదని, తన కూతురును ఇంటర్మీడియట్ చదివించేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

44.4 డిగ్రీలకు గరిష్ట ఉష్ణోగ్రత



జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు బుధవారం 44.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు 27 డిగ్రీలకు చేరాయి. ఫలితంగా మధ్యాహ్నం బయటకు వెళ్లేందుకు ప్రజలు భయపడుతున్నారు. ఇబ్రహీంపట్నం గోధూర్‌లో 44.4 డిగ్రీలు, ధర్మపురి మండలం జైనా, రాయికల్ మండలం అల్లీపూర్‌లో 44.3, మల్లాపూర్‌లో 44.2, రాయికల్, బీమారం మండలం మన్నెగూడెంలో 44.1, మిగిలిన ప్రాంతాల్లో 43డిగ్రీల సెల్సియస్‌లో నమోదయ్యాయి.

క్లుప్తంగా

ఫెయిలైతే నిరాశ చెందొద్దు

జగిత్యాలక్రైం: పదో తరగతి ఫలితాల్లో ఫెయిలైనవారు, మార్కులు తక్కువ వచ్చిన వారు నిరాశ చెందొద్దని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో మాట్లాడారు. మార్కులు తక్కువ వచ్చాయని, ఫెయిల్ అయ్యామని నిరాశ చెంది అఘాయిత్యం చేసుకోవడం సరికాదని, తల్లిదండ్రులకు గుండెకోత మిగల్చొద్దని సూచించారు. మార్కులు తక్కువ వస్తే జీవితంలో ఓడినట్టు కాదని, అవి కేవలం కొలమానం మాత్రమేనని పేర్కొన్నారు. జీవితం మరెన్నో అవకాశాలతో నిండి ఉందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు మానసికంగా ధైర్యం కల్పించేలా తోడుగా ఉండాలని, వారిని ప్రోత్సహించాలన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్టీసీ బస్సులో పొగలు



ఓవర్ హీట్‌తో నిలిచిన ఆర్టీసీ బస్సు

మల్లాపూర్: అసలే ఎండాకాలం.. ఆపై 120 మంది ప్రయాణికులు.. ఓవర్ హీట్‌తో ఇంజిన్ నుంచి పొగలు రావడంతో ఓ ఆర్టీసీ బస్సు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సంఘటన మల్లాపూర్ మండల కేంద్రం శివారులో బుధవారం చోటుచేసుకుంది. జగిత్యాల డిపోకు చెందిన బస్సు నిర్మల్‌కు బయల్దేరింది. అందులో సుమారు 120మంది ప్రయాణికులు ఎక్కారు. మల్లాపూర్ శివారుకు చేరగానే ఒక్కసారిగా ఇంజిన్ నుంచి పొగలు రావడంతో డ్రైవర్ వెంటనే బస్సును నిలిపివేశాడు. మరో బస్సు వచ్చేవరకూ ప్రయాణికులు ఎండలోనే వేచి ఉండి ఇబ్బందిపడ్డారు.

బాక్సింగ్ కోచింగ్ ప్రారంభం



ప్రారంభిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు

జగిత్యాల: జిల్లాకేంద్రంలో బాక్సింగ్ సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పాదం మహేందర్, సెక్రెటరీ శ్రీనివాస్ తెలిపారు. మినీస్టేడియంలో బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాంప్ ఉంటుందని, ఆసక్తి గల క్రీడాకారులు రావచ్చని పేర్కొన్నారు. నెలరోజులపాటు ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అసోసియేషన్ నాయకులు అరుణ్, తిరుపతి, కిరణ్, వంశీకృష్ణ, రాఘవరావు, సాకేత్, వరుణ్ పాల్గొన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన ఆకుల చిన్న గంగన్న (55) బుధవారం పొలం వద్ద ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై కుమారస్వామి కథనం ప్రకారం.. గంగన్న ఏడాది క్రితం చెట్టుపై నుండి కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. శరీరంలో విపరీతమైన నొప్పులు ఉండడంతో అసౌకర్యానికి గురవుతున్నాడు. మందులు వాడినా నొప్పులు తగ్గడంలేదు. జీవితంపై విరక్తి చెంది పొలం వద్దకు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లాడు. పొలం వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. గంగన్న భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కన్నవారిని విస్మరిస్తే చర్యలు



మెట్‌పల్లి: తల్లిదండ్రులను విస్మరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన వృద్ధుల సంరక్షణ చట్టాల అవగాహన పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. వృద్ధుల సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించడానికి అసోసియేషన్ సభ్యులు చేస్తున్న కృషిని అభినందించారు. జిల్లా అధ్యక్షులు హరి అశోక్‌కుమార్, గౌరిశెట్టి విశ్వనాథం, హన్మంత్‌రెడ్డి, యాకూబ్, అశోక్‌రావు, వాజ్జెల బుచ్చిరెడ్డి తదితరులున్నారు.



ఇతను సయ్యద్ అబ్దుల్(53). సిరిసిల్ల పట్టణ శివారులోని పెద్దూరుకు చెందిన అబ్దుల్‌కు ఇద్దరు పిల్లలు. చిన్నప్పటి నుంచి బండలు కొడుతున్నాడు. ఉపాధి కోసం రూ.లక్ష అప్పులు సౌదీ అరేబియా వెళ్లాడు. ఏం లాభం లేదు. అప్పులు తీరాక ఇల్లు చేరాడు. నాలుగేళ్ల క్రితం బండలు కొడుతున్నప్పుడు రాయి ఎగిరి వచ్చి ఎడమ కన్నుకు తాకింది. ఆస్పత్రికి వెళ్లితే కన్ను పోయిందన్నారు. రూ.50వేల వరకు ఖర్చు అయ్యాయి. ఇప్పుడు ఒంటి కన్నుతో బండలు కొడుతున్నాడు. ఇతని ఆసరా పెన్షన్ రాలేదు.



ఇతను షేక్ ఇబ్రహీం(38). సిరిసిల్ల శివారులోని తుర్కాశీకాలనీకి చెందిన ఇబ్రహీం భార్య పేరు రుక్సానా. వీరికి ముగ్గురు కొడుకులు. 13 ఏళ్ల కిందట బండలు కొడుతుండగా రాయి తగిలి కన్ను పోయింది. రూ.15వేల వరకు ఖర్చు అయింది. ఒక్క కన్ను లేకున్నా బండలు కొడుతూ రోజుకు రూ.500 వరకు సంపాదిస్తున్నారు. ఇబ్రహీంకు దివ్యాంగుల సర్టిఫికెట్ లేదు. ఆసరా పెన్షన్ రాదు.



ఇతను సయ్యద్ ఇబ్రహీం(25). పెద్దూరుకు చెందిన ఇబ్రహీం 9వ తరగతి చదివాడు. రెండేళ్లపాటు దుబాయ్ వెళ్లి వచ్చాడు. మళ్లీ బండలు కొడుతున్నాడు. రోజుకు రూ.500 వరకు సంపాదిస్తూ.. కుటుంబానికి ఆసరా అవుతున్నాడు. ఇలా ఒక్కరు ఇద్దరు కాదు.. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 5వేల మంది తుర్కాశీ కార్మికులు నిత్యం కండలు కరిగిస్తూ.. బండలు కొడుతూ జీవిస్తున్నారు. కానీ వారికి కార్మికచట్టాలు.. హక్కులు తెలియవు. అసంఘటితంగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు.

‘బండ’బారిన బతుకులు

కండలు కరిగించినా..
కొండలు పగులదీసినా..

- కుండలో మెతుకులు కరువు
- కష్టజీవులకు దక్కని హక్కులు
- ప్రమాదబీమా ఊసేలేదు
- రెక్కాడితే తప్ప డొక్కాడని తుర్కాశీ కార్మికులు

సిరిసిల్ల: కండలు కరిగించి.. గుట్టలను పిండి చేస్తున్నారు. ఎండ..వాన..చలి.. లెక్కచేయని తనంతో కష్టపడుతున్నారు. అయినా పూటగడవని స్థితిలో తుర్కాశీలు కాలం వెల్లదీస్తున్నారు. భవన నిర్మాణాలకు బండలను సరఫరా చేస్తున్నా వారికి కనీసం కార్మికులుగా గుర్తింపుకార్డులు లేవు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదు. బండలు కొడుతూ ‘బండ’బారిన జీవనం గడుపుతున్న తుర్కాశీలపై మేడే సందర్భంగా ప్రత్యేక కథనం.



వెంకటాపూర్ శివారుల్లో బండలు కొడుతున్న తుర్కాశీ కార్మికులు.



బండలను పగులగొడుతున్న తుర్కాశీ కార్మికులు



కార్మికులు పగిలేసిన బండలు

రాజన్నసిరిసిల్ల జిల్లాలో 82 గ్రామాల్లో..

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 82 గ్రామాల్లో తుర్కాశీ కార్మికులు ఉన్నారు. వీరంతా నిత్యం గుట్టలు, గుట్టబోరును నమ్ముకుని బండలు కొడుతున్నారు. భవన నిర్మాణాలకు, ప్రహరీలకు, పునాదుల నిర్మాణాలకు బండలను సరఫరా చేస్తారు. ఎంతో కష్టతరమైన పనిలో రెక్కలు ముక్కలు చేసుకుంటున్నారు. కండలు కరిగించి కొండలు పగలదీసినా ఇంట్లో కుండలు వెలితిగానే ఉంటున్నాయి. ఎదుగుబొదుగు లేని జీవితంతో బతుకు జట్కాబండిని భారంగా ఈడుస్తున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని దైన్యం ఇంకా వెంటాడుతూనే ఉంది. ఎండా, వాన, చలి ఇవేవి వాళ్లని భయపెట్టవు... రేపటికి పని దొరక్కపోతే ఎలాగన్న వేదన తప్ప... పండుగ పబ్బాలకు పరమాన్నం రుచి ఎరుగరు. జిల్లాలో అట్టడుగు స్థాయిలో జీవిస్తున్న తుర్కాశీల బతుకుచిత్రం దుర్భరం. అటవీ ప్రాంతాల్లో పనిచేయడంతో ఫారెస్ట్ అధికారులు బండలు కొట్టవద్దని పనిముట్లను లాకెళ్తున్నారని కార్మికులు వాపోయారు. రెక్కల కష్టాన్ని నమ్ముకున్న కార్మికుల బతుకులు బండలవుతున్నాయి.

గుర్తింపు లేదు

తుర్కాశీ కార్మికులను భవన నిర్మాణరంగ కార్మికులుగా గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాల్సి ఉండగా.. కార్మికశాఖ వారిని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. భవన నిర్మాణానికి అవసరమైన బండలను కొట్టి సరఫరా చేస్తున్నా గుర్తింపుకార్డులు, భవన నిర్మాణ కార్మికులుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు దక్కడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు చొరవచూపి జిల్లాలోని తుర్కాశీ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

దరఖాస్తు చేసుకుంటే గుర్తింపు కార్డులు ఇస్తాం

భవన నిర్మాణ కార్మికులుగా తుర్కాశీ కార్మికులను గుర్తిస్తాం. తుర్కాశీ కార్మికులు దరఖాస్తు చేసుకుంటే గుర్తింపు కార్డులు జారీ చేస్తాం. ఇప్పటికే జిల్లాలో చాలా మందికి గుర్తింపు కార్డులు ఇచ్చాం. ఇంకా ఎవరైనా గుర్తింపు కార్డులు లేనివారు ఉంటే కార్మిక శాఖ ఆఫీస్‌ను సంప్రదిస్తే జారీ చేస్తాం.
– నాజర్ అహ్మద్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, సిరిసిల్ల

బసవేశ్వరుని భావాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



బసవేశ్వరుడి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాలటౌన్: మహాత్మ బసవేశ్వరుడు బోధించిన మానవతా విలువలు, సమానత్వ భావాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అదనపు కలెక్టర్ లత సూచించారు. బసవేశ్వర జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కులం, వర్గ వివక్షలేని సమాజం కోసం ఆయన అలుపెరుగని పోరాటం చేశారని గుర్తు చేశారు. జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్, లింగాయత్ కుల పెద్దలు పాల్గొన్నారు.

జీవన్ రెడ్డి నివాళి

సామాజిక న్యాయం కోసం బసవేశ్వరుడు అలుపెరుగని పోరాటం చేశారని మాజీమంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. ధరూర్ వద్ద బసవ కూడలిలోగల బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తన బోధనల ద్వారా ప్రజలను చైతన్య పరిచారని గుర్తు చేశారు.



బసవేశ్వరుడికి నివాళి అర్పిస్తున్న జీవన్‌రెడ్డి

అప్పు తీసుకున్న వారు మోసం చేశారని..

- పోలీస్‌స్టేషన్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రికి తరలించిన పోలీసులు

జగిత్యాలక్రైం: మాయమాటలు చెప్పి అవసరం నిమిత్తం బంగారం, నగదు తీసుకున్న ఇద్దరు మహిళలు ఇప్పుడు అప్పుడు అంటూ తిప్పుకుంటుండడంతో మనస్తాపానికి గురైన ఓ వృద్ధురాలు క్రిమిసంహారక మందుతాగి వచ్చి జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో స్పృహ తప్పి పడిపోయిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పెగడపల్లి మండలం రాములపల్లికి చెందిన తోట బాలవ్వ వద్ద జగిత్యాలకు చెందిన అశ్విని, మల్యాల మండలం రామన్నపేటకు చెందిన విజయ ఇద్దరూ కలిసి తమ అవసరం నిమిత్తం 14 నెలల క్రితం 15 తులాల బంగారం, రూ.10 లక్షలు తీసుకుని ప్రామిసరీ నోట్ రాసి ఇచ్చారు. కాలపరిమితి ముగియడంతో బాలవ్వ డబ్బులు చెల్లించాలని కోరగా వారు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. దీంతో గతంలోనే బాలవ్వ పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల ముందు కూడా వారు డబ్బులు చెల్లిస్తామని ఒప్పుకున్నారు. బుధవారం డబ్బులు చెల్లించేందుకు వాయిదా ఉండటంతో బాలవ్వ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. పోలీసులు అశ్విని, విజయను పిలిపించారు. వారు డబ్బులు చెల్లించేందుకు కొంతసమయం కావాలని, ఇప్పుడే కావాలంటే తమ వద్ద లేవని నిరాకరించడంతో మనస్తాపానికి గురైన బాలవ్వ వెంట తెచ్చుకున్న క్రిమిసంహారక మందు తాగింది. అక్కడున్న వారు గమనించి బాలవ్వను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం బాలవ్వ చికిత్స పొందుతోంది.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలవ్వ

స్వగ్రామానికి చేరిన గల్ఫ్ మృతదేహం



హన్మంతు (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): మండలంలోని పోసానిపేటకు చెందిన గుంట హన్మంతు(42) సౌదీ అరేబియాలో రెండు నెలల క్రితం హత్యకు గురికాగా.. ఆయన మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరింది. హన్మంతు కొన్నేళ్లుగా ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్తున్నాడు. తాను ఉంటున్న గదిలో నిజామాబాద్ జిల్లా మెండోరా గ్రామానికి చెందిన వ్యక్తితో ఫిబ్రవరి 28న గొడవ చోటుచేసుకుంది. ఈ ఘటనలో హన్మంతు కత్తిపోట్లకు గురై మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మల్యాల: మండలంలోని జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై బుధవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాలకు చెందిన వేల్పుల మార్క్ (21) దుర్మరణం పాలయ్యాడు. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. మార్క్ జగిత్యాల నుంచి వేములవాడ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. మల్యాల క్రాస్‌రోడ్ వద్దకు రాగానే కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో మార్క్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108 లో జగిత్యాల ఆస్పత్రికి.. అక్కడి నుంచి హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మార్క్ తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ కోన శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

క్రీడాకారిణులకు ‘ఫేస్‌బుక్ మిత్రుల’ చేయూత

- రూ.1.16 లక్షలు సాయం

ధర్మపురి: చదువుతోపాటు పవర్ లిఫ్టింగ్ విభాగంలో రాణిస్తూ.. జాతీయస్థాయిలో పతకాలు సాధించిన ఇద్దరు క్రీడాకారిణులు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి అయ్యే ఖర్చుల నిమిత్తం ఫేస్‌బుక్ మిత్రులు రూ.1.16 లక్షలు సాయం అందించారు. ధర్మపురికి చెందిన శ్యామ్‌రావ్ ఐశ్వర్య, మండలంలోని నక్కలపేట గ్రామానికి చెందిన భూక్య శ్రావణి ఓ వైపు చదువుతూనే మరోవైపు పవర్ లిఫ్టింగ్ విభాగంలో రాణిస్తున్నారు. ఉత్తరఖండ్ రాష్ట్రంలో ఈనెల 5న నిర్వహించే ఏషియన్ ఇంటర్‌నేషనల్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. అయితే పోటీలో పాల్గొనడానికి చెల్లించే ఫీజు, ప్రయాణ ఖర్చులు ఇరువురి కుటుంబ సభ్యులకు భారంగా మారాయి. వీరి పరిస్థితిని తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ స్పందించి ఏప్రిల్ 4న ఫేస్‌బుక్‌లో పోస్టు చేసి వీరికి సాయం అందించాలని కోరారు. తెలుగురాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు శ్రావణి తండ్రి తిరుపతి బ్యాంకు ఖాతాలకు రూ.1.16 లక్షలను విరాళాలుగా పంపించారు. వాటిని స్థానిక సీఐ రాంనర్సింహారెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్లో ఎస్సై ఉదయ్‌కుమార్‌తో కలిసి శ్రావణికి రూ.66 వేలు, ఐశ్వర్యకు రూ.50వేలు పంపిణీ చేశారు. రమేశ్‌తోపాటు సాయం అందించిన దాతలను సీఐ అభినందించారు.



క్రీడాకారిణులకు విరాళాలు అందిస్తున్న సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్, రమేశ్

పోగొట్టుకున్న బ్యాగ్ అప్పగింత

జగిత్యాలటౌన్: జగిత్యాల నుంచి వరంగల్ వెళ్తున్న ఓ ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికురాలు పోగొట్టుకున్న బ్యాగ్‌ను తిరిగి ఆమెకు అప్పగించారు సిబ్బంది. జగిత్యాల డిపోకు చెందిన బస్సులో వరంగల్‌కు చెందిన సులోచన కరీంనగర్‌లో ఎక్కింది. తులం బంగారం, సెల్‌ఫోన్, డబ్బులు ఉన్న బ్యాగ్‌ను బస్సులో మరిచిపోయి దిగిపోయింది. బస్ కండక్టర్ గంగప్రసాద్ ఆ బ్యాగ్‌ను గుర్తించి జగిత్యాల డిపోలో అప్పగించారు. ఇంటికెళ్లిన ప్రయాణికురాలు బ్యాగ్ పోగొట్టుకున్న విషయాన్ని గుర్తించి టికెట్ ఆధారంగా జగిత్యాల డిపోకు చేరుకుంది. అన్ని ఆధారాలను పరిశీలించిన ఆర్టీసీ సిబ్బంది ఆ బ్యాగును ఆమెకు అందించారు. బ్యాగును అందించిన కండక్టర్ గంగప్రసాద్, సిబ్బందికి సులోచన ధన్యవాదాలు తెలిపారు. డిపో క్లర్క్ మొండయ్య తదితరులు ఉన్నారు.



ప్రయాణికురాలికి బ్యాగ్ అందిస్తున్న ఆర్టీసీ సిబ్బంది



ఉపాధ్యాయుల కృషితోనే ఉత్తమ ఫలితాలు



డీఈవోను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

జగిత్యాల: ఉపాధ్యాయుల కృషితోనే ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రంలో నాల్గో స్థానంలో నిలిచామని డీఈవో రాము అన్నారు. పలు సంఘాల నాయకులు డీఈవోను సత్కరించారు. సమిష్టి కృషితో జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలుపుదామన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్, పీఆర్టీయూ ప్రధానకార్యదర్శి యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాజు, మహేశ్, తోట రాజేశ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కన్నవేని మల్లారెడ్డి, సురేందర్, రవి, రాంగోపాల్, రాకేశ్, గుర్రం శ్రీనివాస్, శంకరయ్య, కుమారస్వామి, తపస్ జిల్లా అధ్యక్షుడు దేవయ్య, ప్రసాద్‌రావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నరేందర్‌రావు పాల్గొన్నారు.



డీఈవోను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

అందరికీ అందని అంజన్న అన్నప్రసాదం



కొండగట్టులోని నిత్యాన్నదానసత్రం

- పరిమిత టికెట్లతో భక్తులకు తిప్పలు
- నిత్యం వంద, మంగళ, శనివారాల్లో 200మందికి..
- ఆలయానికి ఏటేటా పెరుగుతున్న ఆదాయం

మల్యాల: కొండగట్టులోని ఆంజనేయస్వామి సన్నిధికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. భక్తుల ద్వారా స్వామివారికి ఆదాయం కూడా పెరుగుతోంది. అయితే నిత్యాన్నదాన సత్రంలో మాత్రం పరిమిత సంఖ్యలోనే అన్నప్రసాదం అందిస్తుండడంతో భక్తులు ఆకలితోనే అలమటిస్తున్నారు. ఈ ఆలయానికి ప్రతిరోజూ వివిధ ప్రాంతాల నుంచి తక్కువలో తక్కువ వెయ్యి నుంచి మూడు వేల మంది వరకు భక్తులు వస్తుంటారు. ఆలయ అధికారులు నిత్యాన్నసత్రం ద్వారా ప్రతిరోజు కేవలం 100మందికి మాత్రమే భోజనం అందిస్తున్నారు. మంగళ, శనివారాల్లో 200మందికి అన్నప్రసాదం పెడుతున్నారు.

దాతలు సహకరించినా..

కొండగట్టుకు వచ్చే భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు ఆలయ అధికారులు దాతలు అందించే విరాళాలు స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. దాతలు ఇచ్చే డబ్బులకు రశీదు అందిస్తున్నారు. అన్నప్రసాదం అందించేందుకు దాతలు సిద్ధంగా ఉన్నప్పటికీ కమిషనర్ స్థాయి నుంచి అనుమతులు రావడంలో జాప్యంతో భక్తులకు భోజనం అందడం లేదు. భక్తుల ద్వారా ఆలయానికి ప్రతిరోజూ రూ.వేలల్లోనే ఆదాయం సమకూరుతోంది. ఆ నిధులతో భక్తులకు అన్నదానం చేసే విషయంలో మాత్రం అధికారులు చొరవ చూపడం లేదు. కనీసం ప్రతిరోజూ 200 మందికి.. మంగళ, శనివారాల్లో 400 మందికి తగ్గకుండా అన్నప్రసాదం అందిస్తే బాగుంటుందని భక్తులు కోరుతున్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

అన్నప్రసాదం అందించాలి



కొండగట్టుకు వచ్చే భక్తులందరికీ అన్నప్రసాదం అందడం లేదు. ప్రతిరోజు వందమందికే భోజనం పెట్టడం సరికాదు. భక్తులు నిరాశతో వెనుదిగాల్సి వస్తోంది. ఆలయానికి ఆదాయం పెరుగుతున్న దృష్ట్యా ఆ సంఖ్యను రెట్టింపు చేయాలి. ఆలయంలోనే టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలి.
యాగండ్ల సుమన్, భక్తుడు, మల్యాల

ఉన్నతాధికారులకు నివేదించాం



అంజన్న భక్తులకు నిత్యాన్నదాన సత్రంలో ప్రతిరోజు 100మందికి.. మంగళ, శనివారం 200మందికి భోజనం పెడుతున్నాం. రెట్టింపు చేయాలని భక్తుల నుంచి వినతులు వస్తున్నాయి. విరాళాలు అందించేందుకు దాతలు ముందుకొస్తున్నారు. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం.
శ్రీకాంత్ రావు, ఈఓ, కొండగట్టు

బస్సులు సరిపడా లేక..

జగిత్యాలరూరల్: సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. జగిత్యాల డిపోకు చెందిన బస్సు మంచిర్యాల జిల్లా జన్నారం వెళ్లేందుకు పాతబస్టాండ్‌కు చేరుకుంది. అప్పటికే బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు చాలామంది ఎక్కడంతో బస్సు కిక్కిరిసిపోయింది. డ్రైవర్, కండక్టర్ వారిని దింపేసే ప్రయత్నం చేసినా దిగకపోవడంతో కొందరు ప్రయాణికులు ఫుట్‌బోర్డుపై ఉండి ప్రయాణం చేయాల్సి వచ్చింది.



కిక్కిరిసిన ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్ట్

కథలాపూర్: మండలకేంద్రానికి చెందిన కల్లెడ జైపాల్ అక్రమంగా గంజాయి తరలిస్తూ విక్రయిస్తున్న క్రమంలో పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. జైపాల్ గంజాయిని కోరుట్ల, కథలాపూర్ ఏరియాలో విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు మెట్‌పల్లి డీఎస్పీ రాములు, కోరుట్ల సీఐ సురేశ్‌బాబు పర్యవేక్షణలో మంగళవారం రాత్రి తనిఖీ చేపట్టగా సిరికొండ శివారులో పట్టుబడ్డాడు. అతడి నుంచి 96 గ్రాముల గంజాయి, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.